మరాఠ యోధుడు ఛత్రపతి

వాడవాడలా శివాజీ జయంతి

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 19 : జిల్లా కేంద్రంలో శివాజీ జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా రామాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ర్యాలీని ప్రారంభించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శివాజీ విగ్రహాన్ని ఉంచి డీజేలతో సాంప్రదాయ నృత్యాలతో, యువకుల నృత్యాలతో ఊరేగింపు బయల్దేరింది. ర్యాలీలో నేతలు పాల్గొన్నారు. అనంతరం పాలి టెక్నిక్ కళాశాల ఆవరణంలో ఉన్న శివాజీ విగ్రహానికి గజమాల వేసి సభను నిర్వహించారు. అదేవిధంగా కదుకుంట్ల గ్రామంలో నవభారత్ యువ శక్తి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఎస్సై జలంధర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సురేష్ యాదవ్, ల్యాబ్ టెక్నిషియన్లు పాల్గొన్నారు. చిట్యాల పాఠశాలలో చెలిమి సంస్థ అధ్యక్షుడు సిద్దిరవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం గణేశ్‌కుమార్, ఉపాధ్యాయులు సంజీవయ్య, వరదాచారి, రుద్రమాదేవి, షఫీ, పీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వనపర్తిలో శోభాయాత్రలో కాషాయజెండా రెపరెపలాడిస్తున్న యువకులు



వనపర్తిలో ప్రత్యేక వాహనంపై అలంకరించిన శివాజీ

పెబ్బేరులో..

పెబ్బేరు, ఫిబ్రవరి 19 : పెబ్బేరులో ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక హిందూజాగృతం సభ్యులు పుర వీధులగుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ధరూర్‌లో..

ధరూరు, ఫిబ్రవరి 19 : ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ప్రజలు ఘనంగా ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఉప్పేరు గ్రామంలో యువకులు, పెద్దలు కలిసి వేడుకలు జరుపుకొన్నారు. సూర్యవంశం ఆరెకటిక కుల సంఘం ఆధర్యంలో శివాజీ జయంతి నిర్వహించారు.

గద్వాలలో ..

గద్వాల టౌన్, ఫిబ్రవరి 19 : జిల్లా కేంద్రంలో శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. పీజీసెంటర్‌లో ఆయన చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో శుంభునాథ మఠంలో శివాజీ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం ప్రత్యేక వాహనంపై శివాజీ విగ్రహాన్ని ఉంచి పట్టణ పుర వీధులగుండా శోభాయాత్రను నిర్వహించారు.

గోపాల్‌పేటలో..

గోపాల్‌పేట, ఫిబ్రవరి 19 : శివాజీ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పొల్కెపహాడ్‌లో శివాజీ చిత్రపటానికి గ్రామ యువకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

వడ్డేపల్లిలో..

వడ్డేపల్లి, ఫిబ్రవరి 19 : శాంతినగర్‌లో శివాజీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం శాంతినగర్‌లోని ప్రధానరోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహేశ్, తేజ, వెంకటేశ్, బాబన్న తదితరులు పాల్గొన్నారు.

మదనాపురంలో..

మదనాపురం, ఫిబ్రవరి 19 : మండలంలో శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యువకులు గోపిస్వామి ఆధ్వర్యంలో శివాజీ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

శాంతినగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెబ్బేరులో నిర్వహించిన శివాజీ జయంతి వేడుకలు

చిట్యాల పాఠశాలలో శివాజీ జయంతిలో నిర్వహిస్తున్న విద్యార్థులు



గద్వాలలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీజీఅధ్యాపకులు

విజయవంతమైన రక్తదాన శిబిరం

రాజోళి, ఫిబ్రవరి 19: రాజోలిలో జైశ్రీరాం సేవాసమితి వారి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తాసీల్దార్ రామ్మోహన్, ఎంఈవో భగీర థరెడ్డి పాల్గొని శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడిని పరామర్శించిన మాజీమంత్రి

ఘటనా స్థలానికి వెళ్లి బాధితుడిని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 19 : వనపర్తి జిల్లాకేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో నష్ట పోయిన బాధితుడిని ఫోన్ ద్వారా బుధవారం మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పరామర్శించి మనోధైర్యాన్ని ఇచ్చారు. వ్యాపారస్తులు నష్టనివారణ కోసం బీమాను ఖచ్చితంగా కలిగి ఉండాలని సూచించారు. బాలాజీనగర్‌లో అగ్ని ప్రమాదానికి గురైన విషయాన్ని తెలుసుకున్న మాజీమంత్రి కార్పెంట్ జీవన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. నష్టం రూ.లక్షల్లో జరగడం దురదృష్టకరమని ధైర్యంగా ఉండాలని ఆయన చెప్పారు.

పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు

జీవన్ గోదాం అగ్ని ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు ప్రమాదస్థలానికి వెళ్లి పరామర్శించారు. రూ.లక్షల్లో నష్టం జరిగిందని బాధితున్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో పార్టీజిల్లా అధికారప్రతినిధి వాకిటి శ్రీధర్, అశోక్, తిరుమల్, జోహెబ్ యూసుస్సేన్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీపోటీలకు విద్యార్థినుల ఎంపిక

ఎంపికైన విద్యార్థినులను సన్మానిస్తున్న జీహెచ్ఎం

పాన్‌గల్, ఫిబ్రవరి 19 : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న జ్యోత్స్న, గాయత్రి, నందిని ముగ్గురు విద్యార్థినులు ఈనెల 20 తేదీ నుంచి 23 వరకు వికారాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఎంపికైనట్లు హెచ్ఎం విజయలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ శ్యామల తెలిపారు. ఇటీవల 34వ కబడ్డీ అసోసియేషన్ గేమ్స్ తరఫున జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించగా ఈ పోటీల్లో పాఠశాల చెందిన ముగ్గురు విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా వారిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థినులకు షూస్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ధరూర్‌లో..

ధరూరు, ఫిబ్రవరి 19 : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు దయానంద్ ఆంగ్లో వేదిక్ పాఠశాల పదో తరగతి విద్యార్థి రామ్ చరణ్ ఎంపికైనట్లు, వ్యాయామ వ్యాయమ ఉపాధ్యాయుడు రవి తెలిపారు. మండలంలోని రేవులపల్లి జెన్‌కో పాఠశాలలో చదివే రామ్‌చరణ్ ఈనెల 20 నుంచి 23 వరకు వికారాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి ఎంపికైన విద్యార్థిని, పీఈటీ రవిని జెన్‌కో ఎస్ఈ శ్రీధర్, డీఏవీ విద్యాసంస్థల ఏఆర్‌వో శేషాద్రినాయుడు అభినందించి రాష్ట్రస్థాయిలో కూడా సత్తా చాటాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యాదవ రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థితో డీఏవీ ప్రిన్సిపాల్ యాదవరెడ్డి

ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను సవరించాలి

నిరసన చేపడుతున్న సీపీఎం నాయకులు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 19 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీలు సీపీఎం, సీపీఐ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఎం పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి అధ్యక్షన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మండ్ల రాజు, ఎ.లక్ష్మీ, సీపీఐ కార్యదర్శి రమేశ్, కార్యదర్శివర్గ సభ్యులు గోపాలకృష్ణ మాట్లాడుతూ.. కేంద్రబడ్జెట్ కాకులను కొట్టి గద్దలకు పంచిపెట్టే విధంగా ఉందని ఎద్దేవా చేశారు. కార్మికులు, శ్రామికులు, రైతులు కూలీల సంపదను దోచి కార్పొరేట్ సంస్థలైన అంబానీ, అదాని లకు కట్టబెట్టేవిధంగా బడ్జెట్ రూపొందించందన్నారు. ఉపాధిహామీ కూలీలకు బడ్జెట్‌ను తగ్గించడం నిర్వీర్యం చేసే కుట్రలో భాగమన్నారు. యూనివర్సిటీలకు నిధులను తగ్గించడం విద్యకు కొఠారి కమీషన్ ప్రకారం 6 శాతం నిధులు కేటాయిచకపోవడం దారుణమన్నారు. వైద్యరంగాన్ని గాలికి వదిలేసిందన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు బడ్జెట్‌లో ఊసే లేదన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీలకు నిధులు తగ్గించి బడుగు బలహీన వర్గాలను మరింత వెనుక బాటుకు గురిచేసే విధంగా బడ్జెట్‌కు రూపకల్పన చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం టౌన్ కమిటీ సభ్యులు డి.కురుమయ్య, జి.మదన్, బాలస్వామి, బీసన్న, ఉమా, సాయిలీల, రాములు, మన్నెం, రత్నయ్య పాల్గొన్నారు.

తెలుగుభాషపై పట్టు పెంచుకోవాలి

ప్రతిభా పోటీలను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

అయిజ, ఫిబ్రవరి 19 : విద్యార్థి దశలోనే తెలుగుభాషపై పట్టు సాధించాలని జీహెచ్ఎం సోమశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఉత్తనూర్ జెడ్పీహెచ్ఎస్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ తెలుగు ఉపాధ్యాయుల ఫోరం గౌరవ అధ్యక్షుడు ఏబేలు ఆధ్వర్యంలో మండలస్థాయి తెలుగు భాషా ప్రతిభా పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపినవారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రభాకర్, వెంకటస్వామి, సత్యం పాల్గొన్నారు.

ఎర్రవల్లిలో..

ఎర్రవల్లి చౌరస్తా, ఫిబ్రవరి 19 : మండలంలోని కొండేరు జెడ్పీహెచ్ఎస్ ఎంఈవో అమీర్‌పాషా ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్య ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

మండలస్థాయి క్విజ్ పోటీలు

ధరూరు, ఫిబ్రవరి 19 : మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల స్థాయి పద్యపఠణ క్విజ్‌పోటీలను నిర్వహించారు. జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హెచ్ఎం ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభకనబర్చిన వారికి బహుమతులను అందజేశారు.

మిర్చికి మద్దతుధర కేటాయించాలి

మిర్చి రైతులతో రైతుసంఘం నాయకులు

అలంపూర్, ఫిబ్రవరి 19 : ఎండుమిర్చికి రూ.25వేల క్వింటా మద్దతుధర ప్రభుత్వం కేటాయించాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న, మండల కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సింగవరం గ్రామంలో మిర్చి పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎండుమిర్చికి క్వింటాకు రూ.20 వేల వరకు ఉండేదని, కాంగ్రెస్ వచ్చాక రూ.10నుంచి రూ.12వేల కూడా లేదన్నారు. కార్యక్రమంలో రైతులు గోపాల్,చిన్న ఈరన్న, బాబు సాబ్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పాలాల్లోకి దూసుకెళ్లిన వాహనం..

అమరచింత, ఫిబ్రవరి 19 : స్పార్‌పియో వాహనం వ్యవసాయ పొలాల్లోకి దూసుకెళ్లి పెనుప్రమాదం తప్పిన ఘటన మండలంలో మస్తీ పుల్ క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం చోటు చేసుకున్నది. స్థానికుల సమాచారం మేరకు.. మద్యమత్తులో అతివేగంగా స్కార్‌పియో వాహనం నడపడంతో అదుపుతప్పి రోడ్డుపక్కనే ఉన్నపొలాల్లోకి దూసుకెళ్లి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టి అక్కడే ఆగిపోయింది. అందులో ఉన్న వారికి స్వల్పగాయాలు కావడం తో పెనుప్రమాదం తప్పిందన్నారు. బాటసారులు గమనించి జేసీబీ సాయంతో వాహనాన్ని బయటకు తీశారు. దీంతో పలువురి గాయాలైన వారికి ఆత్మకూర్ ప్రభుత్వ దవాఖానకు చికిత్సని విత్తం తరలించారు. కాగా కొద్ది సేపు రోడ్డుపై వాహనాలు నిలిచి పోయి ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు.

ఒంటిపై పెట్రోల్ పోసుకొని వ్యక్తి ఆత్మహత్య

వీపనగండ్ల, ఫిబ్రవరి 19 : కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై జీవితంపై విరక్తి పుట్టి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకున్నది. స్థానికులు, ఎస్సై రాణి కథనం మేరకు.. మండలంలోని బొల్లారం చెందిన రాచాల శ్రీనివాస్‌గౌడ్ (50) భార్య పిల్లలతో కలిసి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జీవనోపాధి కోసం వెళ్లారు. రెండురోజుల కిందట గ్రామంలో తమ సమీప బంధువు మృతి చెందడంతో బొల్లారం వెళ్లాడన్నారు. కొంతకాలం నుంచి కుటుంబ కలహాల తో బాధపడుతూ బుధవారం ఉదయం గ్రామ సమీపంలోని తన పొలంలో ఒంటిపై పెట్రోల్ పోసు కొని నిప్పంటించుకొని మృతి చెందాడు. భార్య నీరజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

మానవపాడు, పిబ్రవరి 19 : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టు కొని కేసునమోదు చేసినట్టు ఎస్సై చంద్రకాంత్ తెలిపారు. వివరాల్లోకి వెళితే బుధవారం మధ్యాహ్నం కర్నూలు జిల్లా గార్లపాడు శివారులోని తుంగ భద్రానదీ నుంచి ఇసుకను నింపుకొని జల్లా పురం గ్రామానికి వస్తున్న ఏపీ29టీఏ1948 వాహనాన్ని తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. కాని స్టేబుల్ వెంకటరమణ ఫిర్యాదు మేరకు డ్రైవర్‌అని తేజ్ మార్ వైశ్ యజమాని పైకేసు నమోదు చేసినట్టు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పాన్‌గల్, ఫిబ్రవరి 19 : మండలంలోని కేతేపల్లి గ్రామానికి చెందిన అన్వగల్ల బాలమ్మ(76) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ బాలమ్మ మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు నాగేంద్రం, మల్లయ్య, టక్కు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

గద్వాల టౌన్, ఫిబ్రవరి 19 : సమిష్టి కృషితోనే మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ దిశగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. మున్సిపల్ మున్సిపాలిటి కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కమిషనర్, వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా పారిశుధ్య, ఇంజినీరింగ్, రెవెన్యూ విభాగాల పనితీరు, విధుల నిర్వహణపై సమీక్షించారు. ప్రతిఅంశంపై సమగ్ర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పౌరుల ప్రాథమిక అవసరాలను తీర్చడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్, ప్రత్యేక అధికారి నర్సింగ్‌రావు, మున్సిపల్ కమిషనర్ దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రత పటిష్టంగా ఉండాలి

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 19 : ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూం వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సంతోష్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని గోదాంలో ఎలక్ట్రిక్ ఓటింగ్ మిషన్లు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంలను కలెక్టర్ సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు.

ఇండ్ల లబ్ధిదారులకు సమావేశాలు నిర్వహించాలి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 19 : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు వేగంగా నిర్మాణం చేసుకునేందుకు గ్రామాల్లో అవగాహన సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి తాసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, గ్రామ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ పథకాలకు ఎంపిక చేసిన 15గ్రామాల్లో ఇండ్ల మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు వెంటనే ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

తాగునీటి సమస్య రానివ్వద్దు

వేసవి సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మిషన్ భగీరథ పైనే ఆధారపడకుండా తాగునీటి బోర్లు, మోటర్లు, చేతిపంపుల పనివిధానంపై మరమ్మతులు చేయాలన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు..

జిల్లాలో ఇసుక అవసరం ఉన్న వారు దళారులను ఆశ్రయించవద్దని కలెక్టర్ సూచించారు. ఇసుక మన వాహనం ద్వారా సరఫరా చేస్తున్నామని, ప్రజలకు ఏమైనా సమస్యలు తలెత్తితే కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు. జిల్లాలో 12 ఇసుక రీచ్‌లు ఉన్నాయని ఏమైనా సమస్యలు ఎదురైతే 08545233525 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో యాదయ్య తదితరులు

పత్రాలు అందిన వెంటనే నిర్మాణాలు చేపట్టాలి

పెబ్బేరు, ఫిబ్రవరి 19 : ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికై మంజూరు పత్రాలు అందిన లబ్ధిదారులు వెంటనే ఇండ్ల నిర్మాణాలను చేపట్టాలని కలెక్టర్ ఆదర్శ సురభి సూచించారు. బుధవారం ఆయన మండలంలోని ఈర్లదిన్నె, శ్రీరంగాపురం మండలం నాగసానిపల్లి గ్రామాల్లో పర్యటించి ఇండ్ల లబ్ధిదారులతో సమావేశమయ్యారు.

ఇసుకరీచులపై పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ అన్నారు. పెబ్బేరు మండలం వైశాఖాపురం సమీపంలోని ఇసుకరీచ్‌ను, రాంపురంలో అధికారులు సీజ్‌చేసిన ఇసుక డంపులను ఆయన తనిఖీ చేశారు.కార్యక్రమంలో తాసీల్దార్లు లక్ష్మీ, మురళి, ఎంపీడీవో రవీంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

మామిడిమాడలో స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్న విద్యార్థులు

పెద్దమందడి, ఫిబ్రవరి 19 : మండలంలోని వెల్టూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు అధికారులుగా, ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధన చేశారు. ముఖ్యఅతిథిగా ఎంఈవో విష్ణు మాట్లాడుతూ.. సమాజంలో అన్ని వృత్తులలోకెల్లా ఆదర్శవంతమైందన్నారు. అదేవిధంగా జగత్‌పల్లి పాఠశాలలో ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

వెల్టూరు జెడ్పీహెచ్ఎస్‌లో స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులు

ఖిల్లాఘణపురంలో

ఖిల్లా ఘణపురం, ఫిబ్రవరి 19 : మండలంలోని మామిడిమాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

కార్యక్రమంలో హెచ్ఎం చెన్నప్ప, ఏఏపీసీ చైర్మన్ సాయిలీల, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బుధవారం జోగుళాంబ గద్వాల జిల్లా బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య మర్యాద పూర్వకంగా కలిసిన దృశ్యం

టెండర్లకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 19 : వనపర్తి జిల్లాలోని 6 మైనారిటీస్ రెసిడెన్షియల్‌కు 2024-25 సంవత్సరానికి మటన్ సరఫరాకు సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమాధికారి ఎండీ అఫ్జలుద్దీన్ తెలిపారు. జిల్లా మైనారి టీసంక్షేమశాఖాధికారి పేరా రూ.1000 డీడీ తీసి జిల్లా కార్యాలయంలో అందజేసి ఈ నెల 20నుంచి 22 సాయంత్రం 5.00 గంటల వరకు టెండర్ ఫారం పొందాలన్నారు. ఫారం పొందిన వారు మైనారి టీసంక్షేమశాఖాధికారి, వనపర్తి పేరా రూ.50వేలు ఈఎండీ డీడీ ఫారం జతచేసి 20వ తేదీ నుంచి 22వ తేదీవరకు సాయంత్రం 5.00 గంటల లోపు కార్యాలయంలో టెండర్ అందజేయాలన్నారు. టెండర్ బాక్స్ ఈనెల 24న మధ్యాహ్నం 3.00 గంటలకు అదనపు కలెక్టర్ రెవిన్యూ చాంబర్‌లో ఓపెన్ చేస్తామన్నారు.

పీఎం ఇంటర్న్‌షిప్ దరఖాస్తుల ఆహ్వానం

కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ అందించే పీఎం ఇంటర్న్‌షిప్ పథకం రెండోదశ ప్రారంభమైందని, దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 12 నుంచి మార్చి 11వ వరకు కొనసాగుతుందని డిస్ట్రిక్ట్ ఇండస్ట్రిస్ సెంటర్ జీఎం ఓ ప్రకటనలో తెలిపారు. పథకానికి ఎంపికైన విద్యార్థులకు నెలవారి భత్యం రూ.5వేలు, ఒకేసారి రూ.6 వేలు మంజూరవుతాయని, 12నెలల ఇంటర్న్ షిప్ కాలవ్యవధిలో కనీసం 6నెలలు ఉద్యోగ శిక్షణ ఉంటుందని చెప్పారు. ఇప్పటికే దాదాపు 3లక్షలకు పైగా దరఖాస్తులు అందాయన్నారు. అర్హత 21 నుంచి 24 సంవత్సరం మధ్య వయస్సు కలిగిన వారై ఉండాలని, కుటుంబంలో ఎవ్వరు కూడా ప్రభుత్వం ఉద్యోగిగా ఉండ కూడదని, పదో, ఇంటర్, ఐటీఐ పాలిటెక్నిక్ డిప్లమా, డిగ్రీ పూర్తయి ఉండాలన్నారు. గత సంవత్సర ఆదాయం రూ.8లక్షలోపు కలిగి ఉండాలని చెప్పారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలి

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 19 : ప్రభుత్వం జారీచేసిన జీవో ఆధారంగా మున్సిపాలిటీలో పనిచేస్తున్న వర్కర్లకు కేటగిరి వారీగా వేతనాలు ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటియూ) పట్టణ కార్యదర్శి శివ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లాకేంద్రంలోని స్థానిక సంఘం జిల్లా కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. ప్రభుత్వం కేటగిరి వారీగా జీతాలు పెంచిందని, కానీ గద్వాల మున్సిపాలిటీలో జీతాలు ఇవ్వకుండా తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని విమర్శించారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవి, నరసింహ,ఉప్పేర్ నరసింహ, మహేశ్, రాజు, రఘు, హన్మంత్, లలితమ్మ, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలి

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

గోపాల్‌పేట, ఫిబ్రవరి 19 : ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని చెన్నూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గ్రామసభలో పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ వద్ద హౌసింగ్ అధికారులు వేసిన ఇందిరమ్మ ఇంటి మార్కింగ్‌ను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెన్నూరు గ్రామానికి 172 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు. ఇండ్లు మంజూరు అయిన వాళ్లు యాప్‌లో సూచించిన విధంగా ఇంటి నిర్మాణానికి హౌసింగ్ అధికారులచే మార్కింగ్ చేయించుకొని, మార్చి 15 వ తేదీ వరకు బేస్‌మెంట్ వరకు నిర్మించుకోవాలని సూచించారు. బేస్‌మెంట్ వరకు పూర్తైతే రూ. లక్ష లబ్ధిదారుడి అకౌంట్లో పడతాయన్నారు. ఇళ్లు నిర్మాణం పూర్తి అయ్యే వరకు